సాక్షి
సంగారెడ్డి
గురువారం । 20 । జూన్ । 2024



నులిమేద్దాం రండి!

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నులిపురుగుల నివారణలో భాగంగా చిన్నారులకు నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

వివరాలు 8లో ▸

అసంపూర్తిగా వదిలేసిన ఇశ్రితాబాద్ రోడ్డు



కంకర పోశారు.. బీటీ మరిచారు

కంకర పోసి బీటీ రోడ్డును విస్మరించారు. కాంట్రాక్టర్ ఈ పనులు మధ్యలోనే ఆపివేయడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని ఇశ్రితాబాద్ మీదుగా వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి ఇదీ. దీంతో ఈ రహదారిలో ప్రయాణం అంటేనే వాహనదారులు, స్కూల్ విద్యార్థులు, రైతులు జంకుతున్నారు. టైర్లు జారి కింద పడి గాయాలవుతున్నాయని, వాటికి పంక్చర్‌లు కూడా పడుతున్నాయని దీంతో కిలోమీటర్ల కొద్దీ ఈడ్చుకెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

- సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

న్యూస్‌రీల్

విద్యుత్ లైనింగ్ సమస్యను పరిష్కరించండి

ఉప ముఖ్యమంత్రికి వినతి



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. అలాగే పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యుత్ లైనింగ్ సమస్యల వల్ల గ్రామాల్లో తరచూ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయన్నారు. భట్టి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని చెప్పినట్లు తెలిపారు. ఆయన వెంట డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఫాంల్యాండ్స్ అక్రమాలపై విచారణ జరపాలి



కలెక్టర్ కార్యాలయ ఏఓ పరమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంజీవులు

నారాయణఖేడ్: నియోజకవర్గంలో అక్రమంగా కొనసాగిస్తున్న ఫాంల్యాండ్స్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏఓ పరమేశ్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు, కార్పొరేట్ వ్యాపారులు ఈ ప్రాంతంలో రైతుల వద్ద భూములను తక్కువ ధరకు కొని ఫాంల్యాండ్స్ పేరిట ప్రచారం చేస్తున్నారన్నారు. అమాయకులకు అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలను టార్గెట్ చేసి అన్ని అనుమతులు ఉన్నాయంటూ గుంటల రూపంలో విక్రయిస్తున్నారన్నారు. ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని, అటు ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారని విమర్శించారు. కొన్ని చోట్ల భూముల సర్వే నంబర్‌లు ఒక చోట ఉండగా మరో చోట స్థలాలను చూపుతున్నారన్నారు. ఈ ఫాంలాండ్స్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రాలను ఖేడ్ ఆర్డీఓ, నాగల్‌గిద్ద, కంగ్టి తహసీల్దార్లకు కూడా ఇచ్చామన్నారు.

ప్రహరీ నిర్మాణంపై వివరాలివ్వండి

అధికారులకు ఆర్డీఓ వసంతకుమారి ఆదేశం



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

జిన్నారం(పటాన్‌చెరు): ప్రహరీ నిర్మాణంపై పూర్తి వివరాలివ్వాలని ఆర్డీఓ వసంత కుమారి తహసీల్దార్, ఎంపీడీఓలను ఆదేశించారు. గ్రామానికి చెందిన డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, రోడ్లను కబ్జా చేస్తూ ప్రహరీ నిర్మించారని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. బుధవారం మంగంపేటలో ఆమె విచారణ చేపట్టారు. అధికారులు టీఎస్ఐఐసీకి కేటాయించిన గ్రామంలోని 55 సర్వే నంబర్ గల భూమిని పరిశీలించారు. ఇందులో ఓ పరిశ్రమ యాజమాన్యం ప్రహరీని నిర్మించగా గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర వివరాలు ఇవ్వాలని తహసీల్దార్, ఎంపీడీఓ అరుణలను ఆదేశించారు.

24 నుంచి గ్రూప్–2 పరీక్షలు

సంగారెడ్డి టౌన్: గ్రూప్–2 పరీక్షలు ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో గ్రేడ్–2 సంక్షేమ అధికారుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని సూచించారు. 24వ తేదీ నుంచి ఉదయం 9.30 గంటలకు మొదటి సెషన్ పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్ టిక్కెట్‌లను పరీక్ష తేదీకి మూడు రోజులు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తవ్వేకొద్దీ అక్రమాలు!

- గొర్రెల రవాణా కాంట్రాక్ట్ ఎంపికలో నిబంధనలకు పాతర
- నామినేషన్‌పై అప్పగింత?
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఇతర కాంట్రాక్టర్‌లు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గొర్రెల పంపిణీ పథకం అమలులో జిల్లాలో అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కొనుగోలు చేసిన గొర్రెలను తరలించే ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల ఎంపికలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపిక విషయంలో టెండర్లు పిలవాల్సి ఉండగా నామినేషన్‌పై ఓ రవాణా కాంట్రాక్టర్‌కు అప్పగించడం పలు విమర్శలకు దారి తీస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన కుంభకోణంపై ఇటు అవినీతి నిరోధక శాఖ అధికారులు, అటు కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దర్యాప్తు ప్రారంభించింది. ఇదిలా ఉండగా జిల్లాలో ఈ పథకం అమలు తీరును రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా ఆరా తీసింది. పూర్తి వివరాలను పంపాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గొర్రెల రవాణా కాంట్రాక్ట్‌లో జరిగిన అవకతవకలు వెలుగులోకి వస్తుండటం చర్చనీయాంశంగా మారుతుంది.

రెండో విడతలో ఐదుగురు పోటీ పడినా..

గొర్రెల కాపరుల సంక్షేమమే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో ఈ గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. ఒక్కో లబ్ధిదారుడికి ఒక యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొటేలు సబ్సిడీపై పంపిణీ చేసింది. జిల్లాలో రెండు విడతలుగా ఈ పథకాన్ని అమలు చేశారు. మొదటి విడతలో 18,825 మందికి గొర్రెల యూనిట్‌లను పంపిణీ చేశారు. రెండో విడతలో 1,422 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే రెండో విడత గొర్రెలను ఆంధ్ర రాష్ట్రం గుంటూరు, మాచర్ల ప్రాంతాల్లో కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. అక్కడ కొనుగోలు చేసిన గొర్రెలను జిల్లాకు రవాణా చేసేందుకు ఒక్కో గొర్రెకు కిలోమీటర్‌కు నిర్ణీత మొత్తంలో చెల్లించారు. ఈ కాంట్రాక్టర్ ఎంపిక కోసం మొదట టెండర్ ప్రక్రియను నిర్వహించారు. ఐదుగురు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు పోటీ పడ్డారు. కానీ అధికారులు మాత్రం నామినేషన్‌పై ఓ కాంట్రాక్టర్‌కే కాంట్రాక్ట్‌ను అప్పగించారు. నల్గొండ జిల్లాలో ఇక్కడి రవాణా కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కే.. జిల్లాకు సంబంధించిన గొర్రెల రవాణా కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో మరికొందరు కాంట్రాక్టర్‌లు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ ఎంపికలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని సదరు కాంట్రాక్టర్ న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేశారు. అయితే ఈ రవాణా కాంట్రాక్ట్ ఎంపిక విషయమై జిలా పశుసంవర్ధకశాఖ అధికారి (ఇన్‌చార్జి) రవీంద్రప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా తాను ఇటీవలే ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నానన్నారు. ఈ విషయంలో రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతల కుటుంబసభ్యులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సురేఖ, నాయకులు

ప్రజలకు అండగా కాంగ్రెస్

- మంత్రి కొండా సురేఖ
- ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

పటాన్‌చెరు టౌన్: బీజేపీ అరాచక పాలనపై పోరాడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్న వ్యక్తి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. బుధవారం ఆయన జన్మదిన వేడుకలను ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహించారు. ఇందులో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాగా, నీలం మధు ముదిరాజ్.. జూన్ 19 రాహుల్ జన్మదినం రోజైన బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన పిల్లలకు ఒక్కొక్కరికీ రూ. పదివేలను అందించారు. ఒక మగబిడ్డను ప్రసవించిన మహిళకు మంత్రి సురేఖ చేతుల మీదుగా పది వేల రూపాయల చెక్కు అందజేశారు. అనంతరం నీలం మధు, కాటా శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్‌కు రాహుల్ నాయకత్వం అవసరమన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలందరి మనసును గెలుచుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేశ్, చంద్రారెడ్డి, సదర్ మల్లేశ్, యూసుఫ్, గుండ్ల మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మండలాధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో సంగారెడ్డికి మెట్రో

- ఇదే మొదటి లక్ష్యం
- ఎంపీ రఘునందన్‌రావు



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి: ఎంపీ ఎన్నికల్లో బూత్ స్థాయి కార్యకర్తల కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్దామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామ పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో, సంగారెడ్డిలో నిర్వహించిన తన అభినందన సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రతి కార్యకర్త మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఒక సైనికుడిలా పోరాట ప్రతిభ కనబర్చి తన గెలుపునకు కృషి చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై గెలుపు తనది కాదని కమలం కార్యకర్తలదేనన్నారు. 30 ఏళ్ల క్రితం సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ పదవీని బీజేపీ కైవసం చేసుకుందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వానికి సంగారెడ్డికి మెట్రో రావాలని ఒక్క డీపీఆర్ రాయడం చేత కాలేదన్నారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న జగ్గారెడ్డి ఈ విషయమై నాటి సీఎం కేసీఆర్‌కు వినతులిచ్చారని, ఇప్పుడు వారి పార్టీ అధికారంలో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు వినతులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆరునెలల్లో మెట్రో తేవడమే మొదటి లక్ష్యం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోదీ.. రైతులకు కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ పథకం కింద రూ. 20 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేసిన సందర్భంగా ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

రక్తహీనతపై అవగాహన

హత్నూర(సంగారెడ్డి): బాలికలకు రక్తహీనతపై అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ చంద్రశేఖ ర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరి జన బాలికల వసతి గృహంలో రక్తహీనతపై అవగాహన సదస్సులో అదనపు జిల్లా వైద్యాధికారి నాగనిర్మలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్యుపరంగా రక్తహీనత బాలికలకు వస్తుందన్నారు. వీటిపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పా రు. బాలికలు రక్తహీనత వల్ల ఆరోగ్య సమస్యలు నెలకొంటాయన్నారు. గిరిజన వసతి గృహంలో ఉండే బాలికలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాలుంటే ఎప్పటికప్పుడూ వైద్యులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర స్పెషల్ ఏడీ ఇందిరా, డీటీడీఓ ఫిరంగి, గిరిజన బాలికల వసతి గృహం వార్డెన్ భవాని, బాలికల తల్లిదండ్రులు, విద్యార్థినులతో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సంగారెడ్డి టౌన్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కూల్ విద్యార్థుల దుస్తులను కుట్టడం ద్వారా మహిళా సంఘాలు సభ్యులు ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జ్యోతి, అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి, శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

లింగాయత్‌ల కోసం పోరాడుతా

ఎంపీ సురేశ్ షెట్కార్



ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న లింగాయత్‌లు

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధి కోసం పాటు పడతానని, లింగాయత్‌లను ఓబీసీలో చేర్చే విషయమై పార్లమెంట్‌లో పోరాడుతానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ స్పష్టం చేశారు. వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఖేడ్‌లోని బసవ మండపంలో బుధవారం ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్‌లకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బసవేశ్వరుడి బాటలో నడవాలన్నారు. అందరూ సమానమని చెప్పిన మహావ్యక్తి ఆయనేనని అన్నారు. నేడు దేశంలో దేవుళ్ల పేరిట రాజకీయాలు, ఎన్నికలు జరగడం బాధాకరమని చెప్పారు. అందరూ సమానంగా కలిసి ఉండాలని ఆకాంక్షించారు. పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, సాగర్ షెట్కార్, మాణిక్‌రావు పటేల్, వీర్‌శెట్టి, సతీశ్ షెట్కార్, నాగిశెట్టి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శంకర్ పటేల్, కాశీనాథ్‌పటేల్ పాల్గొన్నారు. ఖేడ్‌లోని పెద్ద దర్గాలో ఎంపీ షెట్కార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌యూసుఫ్, తాహెర్ పాల్గొన్నారు. ఎంపీగా షెట్కార్ గెలిస్తే 108 టెంకాయలు కొడతానని ప్రముఖ వ్యాపారవేత్త హన్మండ్లు మొక్కుకోగా ఇవాళ దాన్ని తీర్చారు. తొలుత షెట్కార్‌తో పూజలు చేయించారు.

నాణ్యమైన తినుబండారాలను విక్రయించాలి

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్

సంగారెడ్డి టౌన్: నాసిరకం తినుబండారాలను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు హోటల్స్, బేకరీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసిరకం, గడువు దాటిన శీతల పానీయాలు, ఆహార పదార్థాలను విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలున్న ఆహార పదార్థాలనే విక్రయించాలన్నారు. వారి వెంట అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఇరుపార్టీల నాయకుల మధ్య తోపులాట

ప్రొటోకాల్ రగడ

- మంత్రి పర్యటనలో ఉద్రిక్తత
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట

కౌల్హారం(నర్సాపూర్): మంత్రి కొండా సురేఖ పర్యటనలో బుధవారం ప్రొటోకాల్ రగడ జరిగింది. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి వచ్చిన మంత్రి, మొదట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసే క్రమంలో స్టేజీపై స్థానిక ప్రజాప్రతినిధులకు సీట్లు కేటాయించలేదు. దీంతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్టేజీపై ఉన్న వారిని ప్రశ్నించడంతో పాటు ఒక్కసారిగా జై కేసీఆర్ అంటూ నినాదాలకు దిగారు. అటు కాంగ్రెస్ నేతలు సైతం జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకదశలో ఇరుపార్టీలకు చెందిన నాయకులు తోపులాటకు దిగారు. అక్కడి నుంచి మండల పరిషత్ భవన ప్రారంభం కార్యక్రమానికి వచ్చిన మంత్రి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డితో రిబ్బన్ కట్ చేయించేందుకు ప్రయత్నించగా, పక్కనే ఉన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి అడ్డు చెప్పారు. దీంతో మంత్రి, ఎమ్మెల్యే మధ్య చిన్న పాటి మాటల యుద్ధం జరిగింది. ఎట్టకేలకు మంత్రి రిబ్బన్ కట్ చేశారు. అక్కడే భవనంలోని వివిధ సముదాయాలను ప్రారంభించే క్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాలను పిలవకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. ఇరువురు కార్యాలయ ఆవరణలో బైఠాయించి మంత్రికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు మండల పరిషత్ కార్యాలయ ప్రధాన ద్వారాన్ని మూసివేసి లోనికి ఎవరూ రాకుండా అడ్డుకున్నారు. చివరికి మంత్రి, ఎమ్మెల్యే వారికి నచ్చజెప్పి వారితో కలిసి కార్యాలయ సముదాయాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నిమ్జ్ భూసేకరణ ముమ్మరం

ముందుకు వస్తున్న రైతులు

- వేగం పెంచిన అధికారులు
- భూసేకరణ లక్ష్యం 12,635 ఎకరాలు
- ఇప్పటివరకు 5,796 ఎకరాలు సేకరణ



నిమ్జ్ ప్రాజెక్టు కోసం గుర్తించిన భూములు

జహీరాబాద్: నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల కలెక్టర్.. అధికారులతో సమావేశం నిర్వహించి భూసేకరణలో వేగం పెంచాలని ఆదేశించారు. దీంతో నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో భూసేకరణలో వేగం పెంచారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా గతేడాదిగా ప్రాజెక్టు పనులు స్తబ్దంగా ఉండిపోయాయి. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అధికార యంత్రాంగం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి రైతుల నుంచి ఒప్పందం చేసుకుంటుంది.

రెండు పరిశ్రమలకు 920 ఎకరాలు కేటాయింపు

నిమ్జ్ ప్రాజెక్టు పరిధిలో ఇప్పటి వరకు రెండు పరిశ్రమల ఏర్పాటుకు గాను 920 ఎకరాల మేర భూములను కేటాయించారు. ఝరాసంగం మండలం చీలపల్లి, ఎల్గోయి, బర్దీపూర్‌లో ఉన్న భూములను ఇచ్చారు. హుండాయ్ పరిశ్రమ కోసం 409 ఎకరాలు కేటాయించారు. ఈ పరిశ్రమ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కోసం ముందుకు వచ్చింది. వెమ్ టెక్నాలజీ పరిశ్రమ కోసం 511 ఎకరాలు కేటాయించారు. ఈ పరిశ్రమలో రక్షణ రంగానికి సంబంధించిన ఉత్పత్తులు తయారు కానున్నాయి.

వంద ఫీట్ల రహదారి

ప్రాజెక్టు పరిధిలోకి వెళ్లేందుకు వీలుగా 65వ జాతీయ రహదారి నుంచి ఎల్గోయి వరకు 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. 9 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇందుకు రూ.100 కోట్ల మేర నిధులు ఖర్చు చేయనున్నారు. సీసీ పనులు కొనసాగుతున్నాయి.

రూ.75 కోట్ల నిధులు మంజూరు



నిమ్జ్ ప్రాజెక్టు పరిధిలోని రైతులు తమ భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చి కాన్సెంట్ ఇస్తున్నారు. భూసేకరణ పనులను ముమ్మరం చేశాం. పరిహారం ఇచ్చేందుకు ఇటీవల రూ.75 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి.

–కె.నాగలక్ష్మి,
నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్–జహీరాబాద్

- జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టు కోసం 12,635 ఎకరాల భూమిని సేకరించాలని 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇప్పటి వరకు 5,796 ఎకరాలను సేకరించారు. అందులో 3,500 ఎకరాల మేర అసైన్‌మెంట్ భూమి ఉంది. ప్రాజెక్టు కింద 17 గ్రామాలను చేర్చారు.
- మొదటి పార్శిల్ కింద 5 గ్రామాలను చేర్చారు. ఇందులో ఝరాసంగం మండలం బర్దీపూర్, ఎల్గోయి, చీలపల్లి, న్యాల్‌కల్ మండలం రుక్మాపూర్, ముంగి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో భూ సేకరణ లక్ష్యం 4,462 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3,596 ఎకరాలు సేకరించారు. ఇంకా 866 ఎకరాల భూ సేకరణ ప్రాసెస్‌లో ఉంది.
- రెండో పార్శిల్ విభాగంలో 12 గ్రామాలను గుర్తించారు. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్, మెటల్‌కుంట, రేజింతల్, న్యామతాబాద్, మామిడ్గి, గుంజోటి, బసంత్‌పూర్, గంగ్వార్, మొల్కన్‌పాడ్, కల్బేమల్, హద్నూర్, హుసెల్లి గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 8,172 ఎకరాల భూ సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,200 ఎకరాల సేకరణ పూర్తయింది. మిగతా భూమిని సేకరించేందుకు గాను ముందుకు వస్తున్న రైతుల నుంచి కాన్సెంట్ తీసుకుంటున్నారు. ఎకరానికి రూ.15లక్షల పరిహారాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కొందరు పరిహారం సరిపోదంటూ భూ ములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కొంత జాప్యం జరుగుతోంది.

క్లుప్తంగా

రక్తహీనతపై అవగాహన కలిగి ఉండాలి

- ట్రైబల్ వెల్ఫేర్ ఎస్ఈ హేమలత
- గిరిజన విద్యార్థులకు అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న హేమలత

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన ఉండాలని ట్రైబల్ వెల్ఫేర్ ఎస్ఈ హేమలత సూచించారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థులకు రక్తహీనత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హేమలత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీరామ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వసతి, గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, పీ. శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బ్యాంకు ఖాతా నుంచి రూ.75 వేలు మాయం

తూప్రాన్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిక్కాడు. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణ కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు గొల్లపల్లి మనీష్‌రెడ్డి ఈ నెల 17న అమెజాన్‌లో స్వామి వివేకానంద వాల్ పేపర్‌ను బుక్ చేశాడు. ఉదయం 18న తన ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు నుంచి రూ.52,890, అరగంట తర్వాత రూ.11,479, మరో అరగంట తర్వాత మూడోసారి రూ.11,279 డబ్బులు డ్రా అయినట్లు ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. కంగుతిన్న ఉపాధ్యాయుడు వెంటనే తన క్రెడిట్ కార్డును బ్లాక్ చేసి 1930 సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించారు. వారు బ్యాంకు ఖాతాను నిలిపివేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణాల్లో తనిఖీలు

స్వీట్‌హౌస్‌కు రూ.5 వేలు జరిమానా

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని పలు స్వీట్‌హౌస్‌లలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పలువురు వినియోగదారుల ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీకృష్ణ హాట్ చిప్స్ షాపునకు రూ.5వేల జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. అనంతరం అధికారి మహేశ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కడికి వెళ్లినా కూడా కొనే ముందు వాటిని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. హోటల్స్, బేకరీ షాపులు, జ్యూస్ సెంటర్లోకి వెళ్లినప్పుడు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని తెలిపారు. తనిఖీల్లో శీను, మోయిస్, రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు పట్టివేత


గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటఅర్బన్: ఓ షాపులో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. పట్టణంలోని నసీర్‌నగర్‌కు చెందిన మహమ్మద్ హమీద్ రంగధాంపల్లి చౌరస్తా వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. అందులో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, అంబర్, బ్లాబుల్ అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. సీఐ విద్యాసాగర్ సిబ్బందితో కలిసి పాన్‌షాపులో తనిఖీ చేయగా రూ. 8 వేల విలువైన నిషేధిత గుట్కాలు, టొబాకో ప్యాకెట్లు లభించాయి. వాటిని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతోంది. ఇందులో భాగంగా చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నారు. ప్రతీ సంవత్సరం జూన్ 20వ తేదీన నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలలకు బుధవారం నుంచి ఈ మాత్రలు వేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏదైనా కారణంతో మాత్రలు వేయించని పిల్లలకు ఈ నెల 27న కచ్చితంగా వేయించాలి.

– సంగారెడ్డి టౌన్

నులిమేద్దాం రండి!

నేడు జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం

19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

● జిల్లాలో 4,05,207 మంది చిన్నారులను గుర్తింపు

జిల్లావ్యాప్తంగా ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 4,05,207 మంది పిల్లలకు నులి పురుగుల మాత్రలు వేయాలని జిల్లా అధికారులు నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, హాస్టల్‌లు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాలో 1,468 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, 68 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 1,505 అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రలు మింగిస్తారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నీళ్లతో తాగిస్తారు. 3 నుంచి 10 ఏళ్ల పిల్లలందరికీ ఒక మాత్రను నమిలి మింగించనున్నారు. నులి పురుగుల మాత్రల పంపిణీలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలను భాగస్వాములను చేస్తున్నారు.

పిల్లల్లో అనేక సమస్యలు..

నులి పురుగులతో పిల్లలకు అనేక సమస్యలు వస్తాయి. వీటి వల్ల శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. నులి పురుగుల నిర్మూలనతో రక్త హీనత నియంత్రణ మెరుగుపర్చే ప్రయోజనాలను పుష్కలంగా కలుగజేస్తుంది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

అపరిశుభ్రతతో నులి పురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతి గోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోర్లలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కూరగాయలను నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూతలు కప్పి ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.


అవగాహన కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి (ఫైల్)

మాత్రలతో ఎలాంటి ప్రమాదం ఉండదు



జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) తప్పనిసరిగా వేయించాలి. అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మాత్రలను సిద్ధం చేశాం. మాత్రలతో ఎలాంటి ప్రమాదం ఉండదు. తల్లిదండ్రులు సమీపంలోని అంగన్వాడీ, పాఠశాల,ఆరోగ్య కేంద్ర సిబ్బందిని సంప్రదించాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకి వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. – వల్లూరి క్రాంతి, కలెక్టర్

నాడు ఫుల్.. నేడు నిల్


జనాలు లేక బోసిపోయిన థియేటర్

- సినిమా థియేటర్లకు తగ్గిన క్రేజ్
- ఓటీటీలోనే చూస్తున్న జనం
- ఇబ్బందుల్లో కార్మికులు, యాజమాన్యాలు

దుబ్బాకరూరల్: నాడు సినిమాలంటే జనాలకు ఎక్కువ క్రేజ్ ఉండేది. కొత్త సినిమా వచ్చిందంటే జనాలు ఎగబడి చూసేటోళ్లు. కొత్త సినిమా రిలీజ్ అయితే గంట ముందే థియేటర్ వద్ద క్యూలో నిల్చొని టికెట్ కొనేవారు. కుటుంబ సభ్యులంతా కలిసి థియేటర్‌కు వెళ్లి సినిమా చూసేవాళ్లు. నచ్చిన హీరో సినిమా వస్తుందంటే చాలు ఏ థియేటర్ చూసినా జనంతో కిక్కిరిసిపోయేది. కానీ ప్రస్తుతం ఆ సీన్ మారిపోయింది. థియేటర్లలో సినిమాలు చూడటానికి సినీ ప్రియులు ఆసక్తి చూపకపోవడంతో థియేటర్లు బోసిపోతున్నాయి. ఓటీటీ ప్రభావం పెరగడంతో అందులో రిలీజ్ అయినప్పుడే చూద్దాంలే అని జనాలు థియేటర్లకు వెళ్లడం మానేశారు. సెల్ ఫోన్లలోనే సినిమాలను వీక్షిస్తున్నారు. బస్సుల్లో, రైళ్లలో, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తూ ఫోన్ల ద్వారా కొత్త కొత్త సినిమాలు చూస్తున్నారు. దీంతో కొన్ని చోట్ల సినిమా థియేటర్లు మూత పడ్డాయి. అలాగే, అందులో పని చేసే కార్మికులు రోడ్డున పడ్డారు. థియేటర్ యాజమాన్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జనం రావడం లేదు



కొత్త సినిమాలు రిలీజ్ అయినా జనాలు మాత్రం థియేటర్‌కు రావడం లేదు. ఎక్కువ శాతం సెల్ ఫోన్లకే పరిమితమవుతున్నారు. ఒకప్పుడు వచ్చిన జనం ఇప్పుడు రావడం లేదు. ఓటీటీలో రిలీజ్ అయినప్పుడు చూద్దామని, అందులోనే చూస్తున్నారు. థియేటర్లు సరిగా నడవక మాకు ఉపాధి కరువైంది.

– జోగయ్య, కార్మికుడు

నాడు క్రేజ్ ఉండేది



నాడు సినిమాలంటే క్రేజ్ ఉండేది. కొత్త సినిమా రిలీజ్ అవుతుందంటే గంట ముందుగానే థియేటర్‌కు వెళ్లి క్యూ కట్టేవాళ్లం. గంటల కొద్ది నిలబడి టిక్కెట్ తీసుకొని సినిమా చూసే వాళ్లం. బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లే వాళ్లం. నేడు ఆ క్రేజ్ తగ్గింది. అందరూ సెల్ ఫోన్లకే పరిమితమయ్యారు.

– ఎల్లం, ప్రేక్షకుడు

రుణాలు కట్టాల్సిందే..!

- రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంకర్లు
- ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదంటూ..
- చెల్లించని వారి ఖాతాలు హోల్డ్‌లో పెడుతున్న వైనం


బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న రైతులు

వట్‌పల్లి(అందోల్): బ్యాంకర్లు ఆగస్టు 15 వరకు ఓపిక పట్టాలని, పంట రుణాల విషయంలో రైతులను ఎటువంటి ఇబ్బందులు పెట్టరాదని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఓ సభలో ఆదేశించారు. కానీ సీఎం ఆదేశాలను బ్యాంకర్లు బేఖాతరు చేస్తున్నారు. వట్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించని రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నారు. అందులో ఉన్న డబ్బులను రెన్యూవల్ పేరుతో పట్టేసుకుంటున్నారు. రైతు బంధు, పింఛన్ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదే విషయంపై బుధవారం పలువురు రైతులు బ్యాంకు వద్దకు చేరుకొని పంట రుణాలను ఆగస్టు 15 వరకు సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేస్తానన్న విషయాన్ని గుర్తుచేస్తూ బ్యాంకు మేనేజర్ జనార్దన్‌ను నిలదీశారు. మాకు రాత పూర్వకంగా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, బ్యాంకు విధి విధానాలే ముఖ్యమని మేనేజర్ తేల్చి చెప్పారు. దీంతో రైతులు చేసేదేమిలేక నిరాశతో వెనుదిరుగుతూ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి మహేశ్ చౌహాన్‌ను వివరణ కోరగా ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతుబంధు డబ్బులను రుణం పేరిట పట్టుకోవద్దని గతంలో పలుమార్లు బ్యాంకు అధికారులకు సూచించాం. ప్రస్తుతం మళ్లీ ఖాతాలను హోల్డ్‌లో పెట్టిన విషయం నా దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు.

రూ.90 వేలు పట్టుకున్నారు



పంట రుణం చెల్లించలేదని రూ.90 వేలు రైతుబంధు డబ్బులను నాకు తెలియకుండానే రుణం కింద కట్ చేసుకోవడంతోపాటు రుణం మొత్తం చెల్లించలేదని ఖాతాను హోల్డ్‌లో పెట్టారు. రెన్యూవల్ చేసుకుంటేనే ఖాతాను హోల్డ్‌లో నుంచి తీసేస్తామని సమాధానం చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెబుతుంటే బ్యాంకు అధికారులు మాత్రం ఇలా ఖాతాలను హోల్డ్‌లో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

– బోయిని అంజయ్య, రైతు నాగులపల్లి

అధిక ఫీజులను నియంత్రించాలి

విద్యార్థి సంఘాల నాయకులు


వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్దన్ అన్నారు. బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు బానోత్ నవీన్, జక్కుల అనిరుద్, సిద్దుల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

విద్యాహక్కు చట్టం నిబంధనలు పాటించని పాఠశాలల నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తూ అధిక ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు.విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ అయ్యావుల శ్యామ్ యాదవ్, మహిపాల్ గౌడ్, గుజ్జ రాజు, బండి శ్రీకాంత్, ఆకుల సతీష్, గోవిందారం రవి, కోడెల నరేశ్, పేర్క మధు, ఇరుగంటి రమేశ్, భానుచందర్, మేడిపల్లి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్య

నారాయణఖేడ్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణఖేడ్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మండలంలోని గంగాపూర్ శివారులో చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సమాచారం అందింది. వెళ్లి పరిశీలించగా 50 నుంచి 60 ఏళ్లు కలిగిన వ్యక్తి ఉరి వేసుకొని మృతదేహం కళ్లిపోయిన ఉంది. అతడి జేబులో లభించిన ఫొటోల ఆధారంగా అబ్బెంద గ్రామానికి చెందిన మడిగే మారుతీగా స్థానికులు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

జహీరాబాద్ టౌన్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పస్తాపూర్‌కు చెందిన చాకలి శ్రీకాంత్(30) దత్తగిరి కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో ఇంట్లో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ. శ్రీకాంత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ విధానంలో కాంగ్రెస్

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ విధానాన్ని అమలు చేస్తుందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు ఎద్దేవ చేశారు. బుధవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనుసరించిన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, భూమలు వస్తాయనుకున్నా ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలిపోయిందన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జ్యోతి, జిల్లా నాయకులు యాదగిరి, ఏసేపు, సురేశ్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా..

- టిప్పర్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన గజ్వేల్ మండలంలోని కొడకండ్ల వద్ద చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు... కొమురంభీం జిల్లా రాహపల్లికి చెందిన ఆడె స్వామికి వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం ఆడె తిరుపతి (35)తో పాటు సోమన్న, చింతల రాములు కలిసి కారును అద్దెకు తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లారు. స్వామిని ఆస్పత్రిలో చేర్పించి అదే రోజు రాత్రి మిగితా వారు రాహపల్లికి తిరిగి బయలు దేరారు. ఈ క్రమంలో గజ్వేల్ మండలంలోని కొడకండ్ల వద్ద ఓ టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ సడన్ బ్రేక్ వేశాడు. టిప్పర్ వెనుకాలే వస్తున్న వీరి కారు అదుపుతప్పి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆడె తిరుపతి, ఆడె సోమన్న, చింతల రాములతోపాటు డ్రైవరు సుడె దుదూకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తిరుపతి మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఆడె నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లం పానకంను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం భల్లునాయక్ తండా, పూల్‌నాయక్ తండాల్లోని గుడుంబా స్థావరాలపై బుధవారం మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందాలు నిర్వహించాయి. ఎక్సైజ్ సీఐ పవన్ కథనం మేరకు.. భల్లునాయక్ తండాలో ఆజ్మీరా సుగుణ, సమ్మవ్వల దగ్గర 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 150 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశాం గతంలోనూ వీరు ఇద్దరూ గుడుంబా అమ్ముతూ పట్టుబడటంతో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. కానీ ఆ బైండోవర్‌ను ఉల్లంఘిస్తూ మళ్లీ గుడుంబా అమ్మినందుకు ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీనాయక్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు సరిత, రూప, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట... భూసారానికి దిట్ట

- సాగు చేస్తే సుస్థిరమైన దిగుబడులు
- మార్కెట్‌లో పలు రకాల విత్తనాలు
- సేంద్రియ ఎరువులు అందుబాటులో లేనప్పుడు ఉపయోగం


జీలుగ పైరు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయ సాగులో ఆధునిక, యాంత్రిక పద్ధతుల ప్రవేశంతో అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో రైతులు మందుకు సాగుతున్నారు. రైతులు రసాయ ఎరువులను ఇబ్బడి ముబ్బడిగా వినియోగిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిపోతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలోని పోషకాల సమతుల్యత దెబ్బతినడంతో పాటు, వేసిన పంటలకు చీడపీడల బెడద పెరిగి దిగుబడులు తగ్గిపోతాయని వ్యవసాయ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి సుస్థిరమైన దిగుబడులు సాధించాలంటే పచ్చిరొట్ట పైర్ల సాగుతో మంచి దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుతూనే, సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, వర్మి కంపోస్టు లభ్యత అందుబాటులో లేని పరిస్థితుల్లో పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంచుకోవచ్చు. సాగుకు ఇదే అనువైన కాలం కాబట్టి పచ్చిరొట్ట పైర్ల సాగుపై మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచనలు, సలహాలు...

పచ్చిరొట్ట విత్తనాల రకాలు..

జీలుగ: ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి. చౌడు భూములు, ఇసుక నేలల్లో సాగు చేయొచ్చు. ముఖ్యంగా వరి సాగు చేసే భూములకు జీలుగ పైరు చాలా అనుకూలంగా ఉంటుంది. పూత దశలో పొలంలో కలియ దున్నడం వల్ల ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు పచ్చిరొట్ట లభిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 6 కిలోల నత్రజని, 1.15 కిలోల భాస్వరం, 5 కిలోల పొటాష్‌లు పుష్కలంగా లభిస్తాయి.


మల్లేశం, మండల వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి

జనుము: ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు చల్లుకోవాలి. జనుమును అన్ని నేలల్లో సాగు చేయడానికి అవకాశం ఉంది. ఇది పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పూత దశలో పొలంలోనే కలియ దున్నుకోవాలి. ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

పిల్లి పెసర: ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనాలు చల్లుకోవాలి. చౌడు భూములకు అనుకూలం కాదు. పచ్చిరొట్టగానూ, పశుగ్రాసంగానూ ఉపయోగపడుతుంది. ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. టన్ను పచ్చిరొట్టలో 7 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం 5 నుంచి 6 కిలోల పొటాష్‌లు లభిస్తాయి.

అలసందలు: ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను చల్లుకోవాలి. పశువులకు మేతగా కూడా వినియోగించొచ్చు. అలసందలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

పెసర: ఎకరానికి 8 కిలోల విత్తనాలను చల్లుకోవాలి. తొలకరి వానలకు చల్లిన పైరులో కాయలు కోసిన తర్వాత మిగిలిన రొట్టను భూమిలో కలియ దున్నుకోవాలి. కాయల ద్వారా రైతులకు మరింత ఆదాయం సమకూరుతుంది.

దున్నకంలో మెలకువలు..

- పచ్చిరొట్ట పైరు కాలం 60 నుంచి 70 రోజులు. ప్రధాన పంట సాగు చేయడానికి 60 రోజుల వ్యవధి ఉన్నప్పుడే సాగు చేయాలి. 40 నుంచి 50 రోజులకు పూత దశలో కలియ దున్నుకోవాలి. 10 నుంచి 15 రోజుల పాటు పచ్చిరొట్ట కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీంతో ప్రధాన పంటలకు పుష్కలంగా భూ సారం లభిస్తుంది.
- పైర్లను కలియ దున్నే సమయంలో నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. విత్తనాలు చల్లే సమయంలో 50 కిలోల సింగిల్ ఫాస్ఫేట్ వేయడం వల్ల పైరు త్వరగా పెరుగుతుంది.
- తేలిక పాటి నేలల్లో సాగు చేసే పైర్లకు 15 కిలోల యూరియా వేయడం వల్ల ఎక్కువ పచ్చిరొట్ట దిగుబడి వస్తుంది. పచ్చిరొట్టను సకాలంలో పూత దశ వచ్చిన వెంబడే కలియ దున్నడం వల్ల త్వరగా కుళ్లిపోయి భూ సారం పెరుగుతుంది.
- రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం తగ్గించుకొని నాణ్యమైన సుస్థిరమైన పంట దిగుబడులను సాధించవచ్చు.